క్లుప్తంగా

ఘనంగా వినికిడి దినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీ రామ్ కుమార్

ఏలూరు (టూటౌన్): స్థానిక దొండపాడు పరివర్తన్ బధిరుల పాఠశాలలో ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచలకులు బి.రామ్ కుమార్ పాల్గొని మాట్లాడారు. మారుతున్న మనస్తత్వాలు, చెవి, వినికిడి సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తమ సంస్థ 25 ఏళ్లుగా వినికిడి లోపం ఉన్న పిల్లలకి ప్రత్యేక విద్య అందించడంతో పాటు వారు ఉన్నత శిఖరాలను అధిరోహించే విధంగా తోడ్పాటు అందిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో డీడీఆర్‌సీ సిబ్బంది, పాఠశాల సిబ్బంది, దివ్యాంగ పిల్లలు పాల్గొన్నారు.

రేపు విజయవాడలో మహాధర్నా

ఏలూరు (టూటౌన్): ఆప్కాస్ రద్దును వ్యతిరేకిస్తూ, ఆప్కాస్ కార్మికుల పర్మినెంట్ కోరుతూ ఈనెల 5న విజయవాడలో మున్సిపల్ కార్మికుల మహాధర్నా నిర్వహించనున్నట్టు ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.సోమయ్య సోమవారం తెలిపారు. మహాధర్నాలో ఏలూరు జిల్లాలోని ఏలూరు కార్పొరేషన్, నూజివీడు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి మున్సిపాలిటీలకు చెందిన కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి



మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ నాయక్

బుట్టాయగూడెం: ఇంటర్మీడియట్ భవిష్యత్‌కు పునాదిలాంటిదని పరీక్షలు బాగా రాసి ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులకు, కళాశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకు రావాలని ఐటీడీఏ పీఓ కె.రాములు నాయక్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని సోమవారం పరిశీలించారు. విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. కాగా 334 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 15 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ ఉండ్రు కుసుమ తెలిపారు. అనంతరం గిరిజన బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాయాలన్నారు. కష్టపడి చదివిన దానిని ఇష్టంతో రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో డీఓ భక్త హనుమాన్, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి హామీకే దిక్కులేదు!

- కలగా కాజ్‌వే స్థానంలో వంతెన నిర్మాణం
- కార్యరూపం దాల్చని ఎమ్మెల్యే హామీ
- బడ్జెట్‌లో కేటాయింపులు నిల్
- ఏలూరు నగర, 30 గ్రామాల ప్రజలకు తప్పని అవస్థలు



శనివారపు పేటకు వెళ్లే మార్గంలో తమ్మిలేరుపై ఉన్న కాజ్‌వే



కాజ్‌వేపై పొంగి పొర్లుతున్న నీరు (ఫైల్)

ఏలూరు (టూటౌన్): శనివారపుపేట కాజ్‌వే స్థానంలో రూ.15 కోట్ల వ్యయంతో వంతెన నిర్మిస్తామని బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ప్రకటించి ఐదు నెలలు గడిచింది. ఎన్నికలకు ముందు, ఎన్నికల అనంతరం ఏలూరు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం శనివారపుపేట కాజ్‌వేపై వంతెన నిర్మాణానికి నిధులు అందిస్తామని ఆర్భాటంగా ప్రకటించారు. అప్పట్లో ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది మిఠాయిలు పంచి హడావుడి చేశారు. అయితే ఇటీవల ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారని ఆశాభావం వ్యక్తం చేసిన ఏలూరు నగర వాసులు, సుమారు 30 పరిసర గ్రామాల ప్రజలకు నిరాశే మిగిలింది.

వరదొస్తే ముంపే

తమ్మిలేరు అవతల ఉన్న ఏలూరు నగరంలోని శ్రీరామ్ నగర్, గ్లేవియర్ నగర్, శనివారపు పేట, లునాని నగర్, దొండపాడు, శనివారపుపేట ప్రాంతాలతో పాటు దుగ్గిరాల, పినకడిమి, చినకడిమి, కొప్పాక మీదుగా నూజివీడు ప్రాంతాలకు వెళ్లేందుకు శనివారపుపేట కాజ్‌వేపై నుంచే రాకపోకలు సాగించాలి. దుగ్గిరాల డెంట్ కాలేజ్, సెయింట్ ఆన్స్ కాలేజ్ వంటి ప్రముఖ విద్యా సంస్థలకు వెళ్లేందుకు, నూజివీడు వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు, జాతీయ రహదారి నుంచి దుగ్గిరాల మీదుగా ఏలూరు నగరంలోకి వచ్చేందుకు ఇదే మార్గం. ఈ మార్గంలో 50 వేల మంది వరకు రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యత గల కాజ్‌వేపై తమ్మిలేరుకు వరద వచ్చినప్పుడల్లా ముంపునకు గురవుతుంది. నీరు ప్రవహిస్తుంది. కాజ్‌వేపై రాకపోకలు నిలిచిపోతుంటాయి. దీంతో ప్రజలు ఏలూరు కొత్త బస్టాండ్ దాటి, టీటీడీ కల్యాణ మండపం రోడ్డు మీదుగా జెయింట్ గ్లేవియర్ నగర్, సెయింట్ ఆన్స్ కాలేజీ వద్ద శనివారపు పేట వెళ్లే రోడ్డుకు రావాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దాదాపు మూడు కిలో మీటర్లు దూరం అదనంగా ప్రయాణించాల్సి వస్తుంది.

హామీలకే పరిమితం

శనివారపుపేట కాజ్‌వే స్థానంలో వంతెన నిర్మాణం ప్రజలకు కలగానే మిగిలింది. తమ్మిలేరు ఉధృతికి కాజ్‌వేపై నుంచి నీరు ప్రవహించినప్పుడు అధికారులు ఈ మార్గంలో రాకపోకలు నిలిపేస్తారు. ఈ సమయంలో అధికార పార్టీ నాయకులు వచ్చి వంతెన నిర్మాణానికి హామీ ఇవ్వడం, అనంతరం విస్మరించడం పరిపాటిగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణం వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలంటూ ప్రజలు ముక్త కంఠంతో కోరుతున్నారు.

కేటాయింపు లేకపోవడం దారుణం



శనివారపుపేట కాజ్‌వే స్థానంలో వంతెన నిర్మాణానికి రాష్ట్ర బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడం దారుణం. ఈ వంతెన నిర్మాణానికి సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీకే దిక్కు లేకుండాపోయింది. ఏళ్ల తరబడి స్థానిక ప్రజలు కోరుతున్నా వంతెన నిర్మాణం కార్యరూపం దాల్చలేదు.

– గొట్టాపు రవికిషోర్, మాజీ ఎంపీటీసీ, శనివారపు పేట, ఏలూరు

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలి



ప్రజలు ఆకాంక్షకు అనుగుణంగా శనివారపుపేట కాజ్‌వే స్థానంలో వంతెన నిర్మించాలి. ప్రతి ఏటా తమ్మిలేరు పొంగినప్పుడల్లా కాజ్‌వేపై రాకపోకలు నిలిచిపోయి ఏలూరు నగరంలోకి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తక్షణం వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

– కె.రామాంజనేయులు, సీపీఎం నగర కమిటీ సభ్యుడు, కట్టా సుబ్బారావుతోట, ఏలూరు

బాల్య వివాహ రహిత సమాజం నిర్మించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ శారద

పెదవేగి : చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల శారీరకంగా, మానసికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారని జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.శారద అన్నారు. పెదపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని పెదవేగి మండలం విజయరాయిలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవంపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలు నిర్మూలించాలనే సందేశంతో అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శారద మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. కిశోర బాలికలకు రుతుస్రావం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం, ఆరోగ్య సంరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కిశోర బాలిక దశ నుంచే ఆరోగ్యం, పోషకాహారంపై శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో పెదపాడు ప్రాజెక్ట్ అదనపు సీడీపీఓ సునీల్ రాజశేఖర్, జిల్లా కార్యాలయపు విస్తరణాధికారి మల్లిక, పర్యవేక్షకులు మేరీ బాయమ్మ, అంగన్‌వాడీలు, కిశోరీ బాలికలు పాల్గొన్నారు.

కొల్లేరు గ్రామాల్లో దాహం కేకలు



ఆగడాలలంకలో ఎండబెట్టిన చెరువు



మోటార్లతో చెరువులోని నీటిని తోడుతున్న దృశ్యం

భీమడోలు: కొల్లేరు గ్రామాల్లో మంచినీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారు. ఎండలు ముదురుతుండడం, చెరువుల్లో నీరు లేక ఆందోళన చెందుతున్నారు. గోదావరి కాలువకు నీరు విడుదల తక్కువగా ఉండడం, వరి సాగుకు ప్రాధాన్యత ఇవ్వడంతో కొల్లేరు గ్రామాల్లోని మంచినీటి చెరువుల్లో నీరు లేక అడుగంటాయి. ఆగడాలలంక చానల్ ద్వారా వడ్డిగూడెం, లక్ష్మీపురం, ఆగడాలలంక, చెట్టున్నపాడు, మల్లవరం గ్రామాల్లోని చెరువులను నీటితో నింపుతారు. కొల్లేరు ఏరియాలో ఆక్వా చెరువులు తప్ప, వరి సాగు లేకపోవడంతో నీటిని విడుదల చేయడం లేదు. దీంతో గ్రామాల్లోని తక్కువ విస్తీర్ణం గల చెరువులు అడుగంటి దుర్వాసన వస్తున్నాయి. వరి సాగులో కీలక దశలో ఉండడం, వంతుల విధానం అమలు చేయడంతో ఆ ఛానల్‌కు మంచినీటి అవసరాల కోసం నీటిని విడుదల చేయడాన్ని గాలికి వదిలేశారు. చెరువుల్లోని నీరు తగ్గగానే అధికారులు లిఖితపూర్వకంగా జలవనరుల శాఖకు తెలియజేయాల్సి ఉంది. అధికారుల్లో సమన్వయం లోపం వల్ల చెరువులు అడుగంటాయి. ఫలితంగా గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తాయి. ఆగడాలలంకలో కొన్ని రోజుల కితమే చెరువును ఎండగట్టారు. వేసవి రోజుల్లో చెరువుల్లో నీటిని నింపుకోవాల్సి ఉండగా నిర్లక్ష్యం వహిస్తుండడంతో గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామస్తులు, పెద్దల ద్వారా సమాచారం అందుకున్న జలవనరుల శాఖ అధికారులు మోటార్లు ఏర్పాటు చేసి ఆగడాలలంక చెరువుకు నీటిని తోడుతున్నారు. నీరు ఆక్వా చెరువులకు వెళ్లకుండా తగు చర్యలు చేపట్టారు. ప్రాధాన్యత క్రమంలో కొల్లేరులోని అన్ని చెరువులకు నీటిని అందిస్తామని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

అడుగంటిన మంచినీటి చెరువులు

జూట్ ఉత్పత్తుల వినియోగంతో మేలు

ఏలూరు (టూటౌన్): పర్యావరణ పరిరక్షణకు జూట్ బ్యాగులు, ఉత్పత్తుల వినియోగం మేలని ఏలూరు సోషల్ సర్వీస్ డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ తాతపూడి ఇమ్మానియేల్ అన్నారు. స్థానిక లంకపేట సెయింట్ జాన్ వెల్ఫేర్ సొసైటీ ఏర్పాటు చేసిన జూట్ బ్యాగ్‌ల డిస్ప్లేని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్లాస్టిక్ వల్ల 21 రకాల క్యాన్సర్ వ్యాధులు వస్తున్నాయని, జూట్, పేపర్ క్లాత్ బ్యాగులను వాడాలని సూచించారు. సొసైటీ ఎండీ పెరికే దీన గ్లాడి మాట్లాడుతూ ప్రతి మహిళా ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. సొసైటీ అధ్యక్షుడు పెరికె వర ప్రసాదరావు మాట్లాడుతూ మహిళలు అందుబాటులో ఉన్న బ్యాంకు రుణాలు తీసుకొని చిన్న చిన్న యూనిట్లు స్థాపించుకోవాలని సూచించారు. నిడదవోలు నుంచి పాతపూడి బాలస్వామి సోషల్ వర్కర్ పాల్గొన్నారు. కృపానందం డ్వాక్రా మహిళలు 50 మందికి పైగా పాల్గొని జూట్ బాక్స్ డిస్‌ప్లే కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఫాదర్ ఇమ్మానియేలు, పెరికె వరప్రసాదరావు

దళిత అధికారులపై వేధింపులు తగవు

దెందులూరు: దళితులైన ఉన్నతాధికారులను కూటమి ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేయడం మంచి సంప్రదాయం కాదని రాష్ట్ర దళిత నాయకులు అన్నారు. సోమవారం రాష్ట్ర నాయకులు పల్లెం ప్రసాద్ నివాసంలో నిర్వహించిన దళిత నాయకులు అత్యవసర సమావేశంలో ఊదరగొండ చంద్రమౌళి, పల్లెం ప్రసాద్, మెండెం సంతోష్ కుమార్ మాట్లాడారు. ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా అధికారులను శాఖాపరంగా ఇబ్బందులు గురిచేయడాన్ని తప్పుపట్టారు. ప్రభుత్వ ఉద్యోగులు నిబంధనలకు అనుగుణంగా ప్రజాప్రతినిధులకు, ప్రజలకు వారధిగా సేవలందిస్తారని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దళిత ఉన్నతాధికారులను లక్ష్యంగా చేసుకుని ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. తప్పు జరిగితే విచారణ చేసి నిర్ధారణ అనంతరం చర్యలు తీసుకోవాలన్నారు. బాధితులకు తామంతా అండగా ఉంటామని, దళిత అధికారులు ధైర్యంగా ఉండాలని, న్యాయం ఎప్పటికీ గెలుస్తుందని వారన్నారు. గాలాయగూడెం సర్పంచ్ చిలకా వెంకటసుబ్బారావు, వార్డు మెంబర్ శ్రీధర్ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దళిత సంఘాల నేతలు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	52
వంకాయలు (కాంతులు)	28	బీన్స్ చిక్కుడు	60
వంకాయలు (తెలుపు)	20	చామదుంపలు	44
బెండకాయలు	36	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	30	కంద	72
కాకర కాయలు	32	బీట్‌రూట్	32
బీరకాయలు (పందిరి)	44	కీరా దోస	40
కాలీఫ్లవర్	--	ఫ్రెంచ్‌బీన్స్	60
క్యాబేజీ	16	అల్లం	60
క్యారెట్	30	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	40	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	40	తోటకూర	10-12
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	20-38	పుదీనా	05
ఆనపకాయ (1)	20	క్యాప్సికమ్	56
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	44

300 ఆవులకు గాలికుంటు టీకాలు



ఆవుకు టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

ద్వారకాతిరుమల: శ్రీవారి గోసంరక్షణ శాలలోని ఆవులకు, దూడలకు సోమవారం గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేసినట్టు మండల పశువైద్యాధికారి అంగర సురేష్ తెలిపారు. ఈ నెల 31 వరకు నిర్వహించనున్న జాతీయ గాలి కుంటు వ్యాధి నివారణ ఆరో రౌండ్ కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాల్లో పర్యటించి, పాడి పశువులకు ఉచితంగా ఈ టీకాలు వేస్తున్నట్టు చెప్పారు. అందులో భాగంగా శ్రీవారి దేవస్థానం గోసంరక్షణ శాలలో ఏర్పాటు చేసిన శిబిరంలో 300 ఆవులకు, 50 దూడలకు ఈ టీకాలు వేశామన్నారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి సురేష్ మాట్లాడుతూ ఈ టీకాలు వేయించడం వలన పశువులు తక్కువగా పాలు ఇస్తాయనే అపోహలను పాడి రైతులు వీడాలన్నారు. గాలి కుంటు వ్యాధి సోకిన పశువులు తీవ్రమైన జరంతో బాధపడుతూ, నోటిలో, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడి, పాల దిగుబడి పూర్తిగా తగ్గిపోతాయన్నారు. అలాగే ప్రాణాలు కోల్పోయే అవకాశం కూడా ఉందన్నారు. 4-6 నెలల వయస్సు ఉన్న పెయ్యి దూడలకు బ్రూసెల్లా టీకాలు వేస్తున్నామని, పశువు జీవిత కాలంలో ఒక్కసారి మాత్రమే ఈ టీకా వేయించాల్సి ఉంటుందన్నారు. కావున రైతులు దూడలకు ఈ టీకాలు వేయించాలని సూచించారు.

శివక్షేత్రంలో భక్తుల సందడి



పట్టిసం రేవులో లాంచీ దిగుతున్న భక్తులు

పోలవరం రూరల్: పట్టిసం శివక్షేత్రం భక్తులతో కళకళలాడింది. సోమవారం శివునికి ప్రీతికరమైన రోజు కావడంతో పలు ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామిని దర్శించుకున్నారు. లాంచీపై గోదావరి నదిని దాటి ఇసుక తిన్నెలపై నడుచుకుంటూ క్షేత్రానికి చేరుకున్నారు.

వారి సేవలు.. భావితరాలకు స్ఫూర్తి



కళావేదికను ప్రారంభిస్తున్న దాతలు, ఉపాధ్యాయులు

దెందులూరు: దాతల సామాజ సేవలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని స్థానిక గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మల్లికార్జునరావు, గ్రంథాలయాధికారి గొల్లపూడి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం ఉన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు దాతలు ఆకుల నరసింహారావు ఉమాలక్ష్మి ట్రస్ట్ అందించిన రూ.1.50 లక్షలతో నిర్మించిన కళావేదికను ఆయన కుమారుడు ఆకుల వెంకట నరసింహ ప్రసాద్ ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా దాత కుమారుడు ప్రసాద్ మాట్లాడుతూ తమ తండ్రి, తల్లి విద్యాభివృద్ధికి, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు తొలి ప్రాధాన్యత ఇచ్చారని వారి ఆశయాలను సోదరుడు శ్రీధర్‌తో కలిసి కొనసాగిస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌తో పాటు బెంచీలు ఇచ్చారు. తెలుగు పండిట్ డాక్టర్ సాయిరాం, ఉపాధ్యాయులు దాతలను అభినందించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	37
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం (ఇంద్ర)	20.15	40
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	20
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	33
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	29
ఏలూరు - తిరుపతి	16.0	4830	34
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	24

విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదులో జాప్యం

గణపవరం: రైతులకు ఆధార్ తరహాలో ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించడానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం నత్త నడకన సాగుతోంది. సాగుభూమి ఉన్న ప్రతి రైతుకూ 14 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్య పత్రం (కార్డు) జారీ చేసే ప్రక్రియను వ్యవసాయశాఖ అధికారులు చేపట్టారు. భవిష్యత్తులో వివిధ సంక్షేమ పథకాల అమలుకు ఈ విశిష్ట సంఖ్య ప్రామాణికం కానుంది. ప్రస్తుతం ఉంగుటూరు నియోజకవర్గంలోని రైతు సేవా కేంద్రాల్లో ఫార్మర్ యూనిక్ ఐడీ నమోదు ప్రక్రియ కొనసాగుతోంది.

పీఎం కిసాన్ రైతుల నమోదు పూర్తి

ఇప్పటివరకూ ఉంగుటూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పీఎం కిసాన్ పథకంలో లబ్ధి పొందుతున్న రైతుల నమోదు ప్రక్రియ పూర్తయిందని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. అయితే పీఎం కిసాన్ పథకం వర్తించని భూయజమానుల గుర్తింపు ప్రక్రియ మాత్రం నెమ్మదిగా సాగుతోంది. ఆయా గ్రామాల్లో భూయజమానులను గుర్తించి వారిని రైతు సేవా కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకునేలా వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులను సమాయుత్తం చేస్తున్నారు. ఈనెల 7వ తేదీకి ఈప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికే రెండు పర్యాయాలు నమోదు గడువును ప్రభుత్వం పెంచింది.

అవసరమైన ధ్రువపత్రాలు

రైతు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం జెరాక్స్ కాపీ, ఒన్‌బీ, ఆధార్‌కు లింక్ అయిన ఫోన్ తీసుకుని రైతు సేవా కేంద్రాల వద్దకు వెళితే అక్కడ ఉన్న సిబ్బంది ప్రభుత్వం ప్రవేశపెట్టిన వెబ్‌సైట్‌లో వివరాలను నమోదు చేసి, రైతు ఆధార్ కార్డుకు అనుసంధానమైన ఫోన్ నంబరుకు మూడు సార్లు ఓటీపీలు పంపిస్తారు. ఆ ఓటీపీలను వ్యవసాయ సిబ్బంది వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయగానే రైతుకు విశిష్ట గుర్తింపు ప్రక్రియ దరఖాస్తు పూర్తయి రైతు ఫోన్ నంబర్‌కు 14 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్య ఎస్ఎంఎస్ ద్వారా వస్తుంది. దీనితో ప్రక్రియ పూర్తవుతుంది.

ప్రయోజనాలు ఇవీ

ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందడానికి ఈ 14 అంకెల సంఖ్య అధికారిక గుర్తింపుగా పనిచేస్తుంది. పీఎంకిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీలు, వ్యవసాయ యంత్ర పరికరాలు, సూక్ష్మపోషకాలు సూక్ష్మసేద్యంపై రాయితీలు, పంట రుణాలు, పెట్టుబడి సాయం, తదితర ప్రభుత్వ పథకాలను రైతులు నేరుగా పొందే అవకాశం కలుగుతుంది. నీటిపారుదల, తెగుళ్ల నియంత్రణ, వాతావరణ సూచనలు వంటి సేవలు అందుకోవడానికి ఉపయోగపడుతుంది. వరి, జొన్న, మొక్కజొన్న, పసుపు, అరటి, మినుము తోపాటు, కూరగాయలు, ఇతరత్రా ఏ పంటలైనా సాగుచేసే రైతులు కనీసం ఒక్క సెంటు వ్యవసాయ భూమి ఉన్న వారందరికీ ఐడీ నంబరు అవసరం.